సాక్షి నల్లగొండ

ఆదివారం । 12 । మార్చి । 2023



దంపతులే నిందితులు!
త్రిపురారం మండలం అంజనపల్లికి చెందిన నగేష్(27) హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. - 8లో



పరిశోధనలు చేయాలి
కాలానికి అనుగుణంగా నూతన అంశాల్లో పరిశోధనలు చేయాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
36°/18°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి బి.దీప్తి

రామగిరి(నల్లగొండ) : మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ జడ్జి బి.దీప్తి అన్నారు. నల్లగొండలోని జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండ్ నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో శనివారం మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తి హక్కులు, బాల్య వివాహాలు, వివాహ చట్టాలు, అబార్షన్ల గురించి విద్యార్థినులకు వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. న్యాయ పరమైన సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అరోర లా కాలేజీ ప్రిన్సిపాల్ యాదగిరి, కనగల్ ఎస్‌ఐ నగేష్, న్యాయవాది రమణరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్లయ్య, షీటీం ఏఎస్‌ఐ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరాలను అరికట్టాలి : ఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

కట్టంగూర్ : నేరాలను అరికట్టేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ హైవేపై బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సహించి, గస్తీ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆన్‌లైన్ నేరాలపై పోలీస్‌శాఖ తరఫున ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింహారెడ్డి, శాలిగౌరారం సీఐ రాఘవరావు, ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వారబందీని ఎత్తివేయాలి



మాట్లాడుతున్న ముదిరెడ్డి నర్సిరెడ్డి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని.. నీటి విడుదలలో వారబందీ పద్ధతిని ఎత్తివేసి నిరంతరాయంగా నీరివ్వాలని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి కోరారు. మిర్యాలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారబందీ పద్ధతిని ఎత్తివేస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే ప్రకటించారు.. కానీ, ఖమ్మం పాలేరు ప్రాంతం వారి కోసం ఎడమకాల్వ నీటిని అక్కడికి తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి నిరంతరాయంగా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో చిరుమర్రి కృష్ణయ్య, మాలి కాంతారెడ్డి, సురేందర్‌రెడ్డి, బసవయ్యగౌడ్, చాంద్‌పాషా, జోషి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న పెన్షనర్లు

మిర్యాలగూడ అర్బన్ : కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని తెలంగాణ రిటైర్డ్ పర్సన్స్ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీశ్ చంద్ర అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్ విధానం సరిగా లేదన్నారు. పోస్టల్, ఆర్టీసీ డిపార్ట్‌మెంట్‌లో కొన్ని కేటగిరీల వారికి అతి తక్కువ పెన్షన్ ఇస్తున్నారని.. కనీస పెన్షన్ రూ.9 వేలు ఉండాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తక్షణమే దానిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లు గౌతంరెడ్డి, సత్యనారాయణరావు, ఏ.లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, బిక్షమయ్య, ఘని, చంద్రారెడ్డి తదితరులున్నారు.

స్పందన అంతంతే..

సర్కార్ స్థలాల్లోని ఇళ్ల క్రమబద్ధీకరణకు ముందుకురాని ప్రజలు

- 59, 58 జీఓల కింద వచ్చిన దరఖాస్తులు 1500లోపే..
- 2020 సంవత్సరం కటాఫ్‌గా దరఖాస్తుల గడువు మరోనెల పొడగింపు
- అభ్యంతరకర స్థలాల్లో ఇళ్లపై వెలువడని ప్రభుత్వ నిర్ణయం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు. జిల్లాలో ఎలాంటి అభ్యంతరం లేని (రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ సీలింగ్) భూముల్లో 7,559 ఇళ్లు ఉన్నా ఇప్పటివరకు 1,500 లోపే ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో జీఓ 59 ప్రకారం డబ్బులు చెల్లించి ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు 962 మంది మాత్రమే ముందుకొచ్చారు. ఇక, 125 గజాలలోపు ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించుకున్న వారికి ప్రభుత్వం జీఓ 58 ప్రకారం ఉచితంగానే క్రమబద్ధీకరిస్తోంది. అలాంటి వారు జిల్లా వ్యాప్తంగా 472 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఇక అంతకంటే ఎక్కువ స్థలంలో ఇళ్లను నిర్మించుకుని నివసిస్తున్న వారు వేల సంఖ్యలో ఉన్నా నిర్దేశిత ఫీజు చెల్లించాల్సి ఉండటంతో ఎక్కువగా ముందుకు రావడం లేదు.

ఇప్పుడైనా ముందుకొస్తారా?

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం 58, 59 జీఓలను తీసుకొచ్చింది. మరోవైపు సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి రూ.3 లక్షలు మూడు విడతల్లో ఇచ్చేలా గృహ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జీఓ 59 ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 23వ తేదీ వరకు 962 మంది మాత్రమే నిర్దేశిత ఫీజు చెల్లించి ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు వచ్చారు. అయితే 2014 కటాఫ్ తేదీగా నిర్ధారించి ప్రభుత్వం గతంలో దరఖాస్తులను ఆహ్వానించింది. ఇప్పుడు తాజాగా కటాఫ్ తేదీని మార్పు చేసింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 2020 కటాఫ్ తేదీగా నిర్ణయించింది. అలాంటి వారంతా దరఖాస్తు చేసుకునేలా నెల రోజులపాటు అవకాశం ఇవ్వనుంది. ఇప్పటికే 58 జీఓ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల రెగ్యులరైజేషన్‌ను ఉచితంగా చేయడం ప్రారంభించింది. మరోవైపు 59 జీఓ ప్రకారం డబ్బులు చెల్లించిన వారి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది. శనివారమే నల్లగొండతోపాటు ఇతర మండలాల్లో ప్రారంభమైంది. ఇప్పుడు కటాఫ్ తేదీని మార్పు చేసి మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు నెల రోజులు గడువు ఇవ్వడంతో దరఖాస్తుదారుల సంఖ్య పెరగవచ్చని అధికారులు భావిస్తున్నారు. నిబంధనల ప్రకారం 125 గజాలలోపు స్థలంలో ఇల్లు ఉంటే ఉచితంగా క్రమబద్ధీకరిస్తుండగా, 126 గజాల నుంచి 250 గజాలలోపు స్థలంలో ఇళ్లు ఉంటే మార్కెట్ విలువలో 50 శాతం చెల్లించేలా, 251 నుంచి 500 గజాలలోపు స్థలంలో ఇల్లు ఉంటే 75 శాతం, 500 గజాలకు మించి ఉంటే మార్కెట్ విలువను చెల్లించి క్రమబద్ధీకరించుకునేలా అవకాశం కల్పించింది.

12 రకాల భూముల్లో 39,380 నిర్మాణాలు

జిల్లా యంత్రాంగం సేకరించిన లెక్కల ప్రకారం 12 రకాల ప్రభుత్వ భూముల్లో 39,380 నిర్మాణాలు ఉన్నాయి. అందులో రెవెన్యూ స్థలాలు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలోని భూముల్లో 7,559 నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జీఓ 58, 59 ప్రకారం అభ్యంతరం లేని రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములను మినహాయిస్తే మిగతా భూముల్లో 31,821 ఇళ్లు ఉన్నాయి. వాటి విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

మిగతా భూముల్లో ఇళ్లపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

అభ్యంతరం లేని రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ సీలింగ్ స్థలాల్లో ఇళ్లను క్రమబద్ధీకరిస్తున్న ప్రభుత్వం అవి మినహా మిగతా 10 రకాల ప్రభుత్వ, ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల్లో (అభ్యంతరకరమైనవిగా గుర్తించినవి) నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇందులో సాంఘిక సంక్షేమ శాఖ సేకరించిన భూములు, మున్సిపాలిటీల్లో ఇటీవల కలిసిన ఆబాదీ/గ్రామకంఠం భూములు, దేవాదాయ శాఖ భూములు, వక్ఫ్ భూములు, శిఖం/ఎఫ్‌టీఎల్ భూములు, ఇతర ప్రభుత్వ శాఖల భూములు, ప్రభుత్వ లీజ్ భూములు, నోటరీ ల్యాండ్స్, సాదాబైనామాలు, వీటిల్లో కవర్ కాని ఇతర భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల వివరాలను కూడా సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు వాటి వివరాలను సేకరించారు.

• బండి వ్యాఖ్యలపై ఆగ్రహం



ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో శనివారం ఆయన దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు

ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న బృందం సభ్యులు

దేవరకొండ : దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని శనివారం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్య కేంద్ర వైద్య బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు. అనంతరం బృందం సభ్యులు డాక్టర్ దత్త, డాక్టర్ జయశ్రీ కుమరన్ ఆస్పత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్, ఎక్స్‌రే విభాగం, ఆపరేషన్ థియేటర్, ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ వార్డులను కలియదిరిగి అక్కడి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వసతులను నిశితంగా పరిశీలించారు. దేవరకొండ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని వారు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్‌కు సూచించారు. లక్ష్య స్కీంలో భాగంగా దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి ఎంపికైతే జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని, ఆస్పత్రి అభివృద్ధికి రూ.18 లక్షలు నిధులు వస్తాయని సూపరింటెండెంట్ తెలిపారు. వారి వెంట జిల్లా క్వాలిటీ మేనేజర్ దివాకర్, ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకాశమే హద్దుగా ఎదగాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆర్‌సీఓ షకీనా

నాగార్జునసాగర్ : విద్యార్థులు అవకాశాలు వినియోగించుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్(ఆర్‌సీఓ) షకీనా అన్నారు. నాగార్జునసాగర్‌లోని మహాత్మా జ్యోతీబాపూలే తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయంలో 35వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మొదటగా జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో 306 విద్యాలయాలను ఏర్పాటు చేసి అందులో ఐదో తరగతి నుంచి డిగ్రీవరకు విద్యనభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను వినియోగించుకుని ప్రపంచంతో పోటీ పడగలిగే సత్తాను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ హేమలత, సీఐ నాగరాజు, శివాజీ, చక్రవర్తి, గోపాల్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

- మునుగోడు నుంచి యాదాద్రికి చేరిన పాదయాత్ర



యాదగిరిగుట్టకు చేరుకున్న వీఆర్‌ఏల పాదయాత్ర

యాదగిరిగుట్ట : రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి రాష్ట్ర చైర్మన్ ఆర్.విజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 8వ తేదీన మునుగోడు నుంచి చేపట్టిన పాదయాత్ర శనివారం సాయంత్రం యాదగిరిగుట్టకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది నెలల నుంచి అనేక రకాల పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నిక పూర్తి కాగానే హామీలను నెరవేరుస్తామని మంత్రి కేటీఆర్, అప్పటి సీఎస్ సోమేష్‌కుమార్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ, ఎన్నికలు ముగియగానే ఆ విషయాన్ని మరిచిపోయారన్నారు. యాదాద్రీశుడి సన్నిధిలో పాదయాత్ర ముగిసిందని, ఆదివారం యాదగిరిగుట్టలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏలతో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఈ పాదయాత్రలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాసరి వీరన్న, రాష్ట్ర కో చైర్మన్ లక్ష్మళ నర్సింహారావు, కన్వీనర్లు కావలి సత్యనారాయణ, నార్ల శ్రీనివాస్, ముదాం చిరంజీవి, కమిటీ సభ్యులు రత్నం, మల్లేష్, రాజ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

17నుంచి జనచైతన్య యాత్ర



మాట్లాడుతున్న సుంకరి వీరయ్య

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తి చూపేందుకు ఈనెల 17నుంచి 29వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జనచైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుంకరి వీరయ్య తెలిపారు. శనివారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడమే జనచైతన్య యాత్ర లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు నర్సింహ, అనురాధ, జగదీశ్, బాలరాజు, మల్లేశం, చంద్రారెడ్డి, పాండు, వెంకటేశం, ముత్యాలు వెంకటేష్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం.. కార్పొరేట్ల ఏజెంట్

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



పాలకవీడు : మాట్లాడుతున్న రంగారెడ్డి

నల్లగొండ : కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఏజెంట్‌గా పనిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం శనివారం నల్లగొండలోని మనోరమ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని, అంబాని ప్రధాని మిత్రులని ఆరోపించారు. అదాని కుంభకోణాలపై విచారణ జరిపి బ్యాంకులకు తిరిగి డబ్బులు కట్టించాలని డిమాండ్ చేశారు. ఔషధాలపై జీఎస్టీని తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భానుకిరణ్, కార్యదర్శి రాజుభట్ మాట్లాడుతూ మందుల ధరలను తగ్గించాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, ప్రభుత్వ రంగ ఫార్మా వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, విద్యాసాగర్, నాగేశ్వర్‌రావు, సునీల్, శశిరాం, నిరంజన్, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు హక్కు పట్టాలివ్వాలి

పాలకవీడు: ఏళ్లుగా పోడు భూములను సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న రైతులందరికీ హక్కు పట్టాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని శూన్యపహాడ్ గ్రామంలో గిరిజన చైతన్యయాత్రను ప్రారంభించి మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో సీపీఎం పోరాటాల ఫలితంగా పోడు రైతులకు పట్టాలు దక్కాయని అన్నారు. ర్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ రవినాయక్, అనంతప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

సంస్థాన్ నారాయణపురం : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం సంస్థాన్‌నారాయణపురంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 శాతం పీఆర్సీ ఇప్పించిన ఘనత పీఆర్‌టీయూ టీఎస్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు, సుధాకర్‌రెడ్డి, కిరణ్, సబిత, సూజత, రాము, హరికిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు



పాతగుట్టలో హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదగిరీశుడి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం శతఘటాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే బంగారు, వెండి కలశాలల్లో ఫలామృతాలు, సుగంధ ద్రవ్యాలు నింపి వాటితో స్వయంభూలకు, ప్రతిష్టా అలంకార మూర్తులకు అభిషేకం చేశారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నిత్యారాధనలు

ప్రధానాలయంలో సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన గావించారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు. పాతగుట్ట ఆలయంలోనూ స్వాతి నక్షత్ర పూజలు, నిత్యారాధనలు నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖలో గోల్‌మాల్

- ఓఓఈ నిధుల దుర్వినియోగంపై విచారణ
- వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూఓల సిబ్బంది నుంచి వివరాలు సేకరణ



నల్లగొండ : బీసీ సంక్షేమ శాఖలో నిధులు దుర్వినియోగమయ్యాయని వచ్చిన ఆరోపణలపై ఆ శాఖ రాష్ట్ర కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ సంధ్య విచారణ చేపట్టారు. ఆ శాఖ పరిధిలోని హాస్టళ్లలో అత్యవసర పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయడం.. ఆ పనులు చేయకుండానే సంక్షేమ అధికారే తిరిగి వార్డెన్ల నుంచి డబ్బులు తీసుకున్నారని.. దాంతో హాస్టళ్ల నిర్వాహణ అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై ఈనెల 3వ తేదీన బీసీ విద్యార్థి సంఘం నాయకుడు గండిచెర్వు వెంకన్న ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బూర వెంకటేశ్వర్లుకు విద్యార్థి నాయకులు ఫిర్యాదు చేశారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సంధ్యను విచారణకు ఆదేశించారు. ఆమె నల్లగొండలోని బీసీ సంక్షేమ కార్యాలయానికి వచ్చి విచారణ జరిపారు.

ముగిసిన విచారణ

బీసీ సంక్షేమ అధికారి డబ్బులు తీసుకున్నది నిజమా కాదా..? తీసుకుంటే ఎవరి ద్వారా తీసుకున్నారు.. అన్న విషయాలను వార్డెన్లను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా ఏఎస్‌డబ్ల్యూఓలు, కార్యాలయ సిబ్బంది వద్ద నుంచి కూడా వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఈ ఆరోపణపై సంక్షేమ అధికారి నుంచి కూడా వివరాలు తీసుకుని వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికి విచారణ ముగిసింది. ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక సమర్పించిన అనంతరం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాల్సి ఉంది.

జిల్లాలో 47 బీసీ హాస్టళ్లు..

జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 47 హాస్టళ్లు ఉన్నాయి. వీటి నిర్వాహణ కోసం ప్రతి హాస్టల్‌కు ఓఓఈ (అదర్ ఆఫీస్ ఎక్స్‌పెన్సెస్) కింద నిధులు వస్తాయి. హాస్టళ్లలో నల్లాలు, టాయిలెట్లు, విద్యుత్‌కు సంబంధించిన పనులు, ఇతర అత్యవసరాలకు కోసం హాస్టల్ వార్డెన్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారికి నివేదికలు పెడతారు. దాని ఆధారంగా నిధులు మంజూరు చేస్తే ఆయా పనులు నిర్వహిస్తారు. అయితే జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత జిల్లాలోని 23 హాస్టళ్లకు ఓఓఈకి నిధులను మంజూరు చేశారు. తర్వాత ఆ నిధులను కార్యాలయ అకౌంటెంట్ ద్వారా తిరిగి తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఇదే సందర్భంలో కార్యాలయంలోని ఓ ఉద్యోగిని బదిలీ చేయడం, దాంతో అతను ఉద్యోగ సంఘాలను ఆశ్రయించడం.. ఆ తర్వాత అతడిని సస్పెండ్ చేయడం.. రాజకీయ నేతల ప్రవేశంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. మరో ఉద్యోగి కొంత కాలం పాటు డ్రైవర్ విధులు కూడా నిర్వహించారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో వార్డెన్లు.. సంబంధిత అధికారి తీరుపై వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా విద్యార్థి నేతలు ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయడంతో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

పూరిగుడిసె దగ్ధం


దగ్ధమైన పూరి గుడిసె, గడ్డివాము

మఠంపల్లి/మర్రిగూడ: ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పూరి గుడిసెతోపాటు గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని సరంపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జిడ్డు నర్సమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఆ సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వెలువడి గ్యాస్ సిలెండర్ పేలడంతో పూరి గుడిసెలోని దుస్తులు, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే ఉన్న దామెర జంగయ్యకు చెందిన గడ్డి వాము సైతం మంటలకు దగ్ధమైంది. గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఇరువురికి సుమారు రూ.80వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. కాగా సర్పంచ్ వెన్నమల్ల వెంకటమ్మమధుకర్, దామెరభీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దంపతులే నిందితులు..!

- వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘాతుకం
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

హాలియా : త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన నగేష్(27) హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం కారణంగానే నగేష్ దారుణ హత్యకు గురయ్యాడని తేల్చారు. ఘాతుకానికి ఒడిగట్టిన దంపతులను అరెస్టు చేశారు. హాలియా పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి మిర్యాలగూడ డీఎస్పీ పనకంటి వెంకటగిరి కేసు వివరాలు వెల్లడించారు. త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన నగేష్(27) గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన రాత్రి సతీష్ అతని తమ్ముడు ఎర్రగొర్ల నగేష్ ఇద్దరూ భోజనం చేసిన తరువాత ఒకే చోట పడుకున్నారు. అదే రోజు రాత్రి సుమారు 11 సమయంలో ఎర్రగొర్ల నగేష్ సెల్ ఫోన్‌కి కాల్ వచ్చింది. ఆ తరువాత ఉదయం ఎర్రగొర్ల సతీష్ చూడగా నగేష్ కనిపించలేదు. ఈనెల 6వ తేదీ నుంచి నగేష్ కనబడలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో నగేష్ సోదరుడు ఎర్రగొర్ల సతీష్ త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ నెల 7న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని..

నగేష్, కంచుగంట్ల శ్రీనివాస్ ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఒకరింటికి ఒకరు వచ్చిపోతుండేవారు. శ్రీనివాస్ లేని సమయంలో కూడా నగేష్ ఇంటికి వచ్చి వెళ్తూ అతని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. నగేష్ తన భార్యతో చనువుగా ఉంటూ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని శ్రీనివాస్ అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంలో పలుమార్లు నగేష్‌ని హెచ్చరించినా తీరు మార్చు కోలేదు. నగేష్‌తో స్నేహంగా ఉంటూనే అతనిపై శ్రీనివాస్ కక్ష పెంచుకున్నాడు. అదును చూసి హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

భార్యతో ఫోన్ చేయించి..

పథకం ప్రకారం ఈనెల 5వ తేదీ రాత్రి శ్రీనివాస్ తన భార్య మీనాక్షితో నగేష్‌కి ఫోన్ చేయించి తన ఇంటికి వచ్చేవిధంగా పథకం పన్నాడు. అదే రోజు రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన నగేష్‌ను శ్రీనివాస్ కత్తితో మెడపై నరికాడు. నగేష్‌కి బలమైన గాయాలు అయి మంచంపై పడిపోగా శ్రీనివాస్ భార్య మీనాక్షి ఇంట్లో ఉన్న కర్రతో నగేష్ తలపై బలంగా మోదింది. దీంతో మరో మారు కత్తితో శ్రీనివాస్ నగేష్‌ని పొడిచాడు. అతని ప్రాణం ఇంకా పోలేదని భావించిన శ్రీనివాస్, అతని భార్య మీనాక్షి ఇద్దరూ కలిసి నైలాన్‌తాడుతో నరేష్ మెడకు రెండు సార్లు చుట్టి హత్య చేశారు. అనంతరం పశువుల కొట్టం వద్ద ఉన్న సెప్టిక్ ట్యాంక్ మూత పగలగొట్టి నగేష్ మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్‌లో పడవేశారు. దీంతో పాటు నగేష్ చెప్పులు, సెల్‌ఫోన్‌తో పాటు రక్త మరకలు అంటిన తమ దుస్తులను సెప్టిక్ ట్యాంకులో వేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని తన ఇంట్లోని వడ్ల బస్తాల వెనుక దాచిపెట్టినట్లు పోలీసులు సమక్షంలో కంచుగంట్ల శ్రీనివాస్, భార్య మీనాక్షి ఒప్పుకున్నారు.

అనుమానంతో అదుపులోకి తీసుకుని..

ఇటీవల నగేష్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో భాగంగా కంచిగట్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తన భార్యతో కలిసి నగేష్‌ను హత్య చేసి తన ఇంట్లో ఉన్న సెప్టిక్ ట్యాంకులో మృతదేహాన్ని పడవేసినట్లు నేరం అంగీకరించాడు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకుని కేసులో నిందితులైన శ్రీనివాస్‌తో పాటు అతని భార్య కంచిగట్ల మీనాక్షిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటగిరి వివరించారు. కేసును ఛేదించిన హాలియా సీఐ గాంధీనాయక్, త్రిపురారం ఎస్‌ఐ శోభన్‌బాబు, సిబ్బంది రవి, శ్రావన్‌కుమార్, శ్రీనివాస్, రాము, శ్రీనును అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో హాలియా ఎస్‌ఐ క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- ఇంటింటికీ తిరుగుతూ కిలో బియ్యానికి రూ.10వరకు చెల్లించి కొనుగోలు
- సేకరించిన బియ్యాన్ని నల్లగొండ, భువనగిరిలో విక్రయం

మునుగోడు: పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వ్యాపారులు ఆ బియ్యంతో ప్రతి నెలా రూ.లక్షలు గడిస్తున్నారు. మండలంలోని కొందరు రైస్ మిల్లు వ్యాపారులు కొంత మంది చిరువ్యాపారులని ప్రోత్సహిస్తూ ఇంటింటికీ పంపి కిలో రూ. 7 నుంచి రూ.10 వరకు చెల్లించి కార్డు దారుల నుంచి కొనుగోలు చేయిస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాని తమ మిల్లులో నిల్వ చేసుకొని వాటిని సేకరించిన వారికి కిలోకు రూ. 3 చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిసింది. అలా సేకరించిన బియ్యం 50 క్వింటాళ్ల వరకు పోగు కాగానే రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఓ వాహనంలో లోడు చేసుకొని చిట్యాల, భువనగిరి, నల్లగొండ పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇలా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న సమయంలో ఎవరైన అధికారులు లేదా పోలీసులు పట్టుకుంటే వెంటనే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు రంగప్రవేశం చేసి వ్యాపారులకు మద్దతుగా నిలుస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతి నెలా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


రమేశ్‌కు బంగారు ఆభరణాలను అందజేస్తున్న డ్రైవర్ వెంకటాద్రి

నల్లగొండ రూరల్ : బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన బంగారు ఆభరణాలను తిరిగి అప్పగించి ఓ ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి నల్లగొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్ శుక్రవారం హైదరాబాద్ నుంచి రూ.3లక్షల విలువైన బంగారు ఆభరణాలతో ఆర్టీసీ బస్సులో నల్లగొండకు వచ్చిడు. బస్సు దిగేముందు బంగారు ఆభరణాలను మర్చిపోయాడు. డ్రైవర్ వెంకటాద్రి నిజాయితీగా బంగారు ఆభరణాలను భద్రపరిచి రాత్రి ప్రయాణికుడు రమేష్‌కు అందజేశాడు. డ్రైవర్ వెంకటాద్రిని ఆర్టీసీ అధికారులు అభినందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం


సతీష్ మృతదేహం


వెంకటయ్య (ఫైల్)

నేరేడుచర్ల : వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. నేరేడుచర్ల, నేరెడుగొమ్ము మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన మేడే సతీష్(28) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఏ పని చేయలేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య మల్లేశ్వరీ, ఇద్దరు కుమారులున్నారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకుని మరొకరు..

చందంపేట : కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన వంపు వెంకటయ్య (35) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వెంకటయ్య నెల రోజులుగా గ్రామం నుంచి అదృశ్యం కావడంతో కొండమల్లేపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదిలా ఉంటే నేరెడుగొమ్ము మండల కేంద్రంలో ఉంటున్న వరుసకు మేనత్త ఇంటికి వచ్చిన వెంకటయ్య తన ఆరోగ్య పరిస్థితి గురించి చెప్పుకొని తాను బతకలేనని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంకటయ్యను తీసుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ కొన్ని నెలల క్రితం నేరెడుగొమ్ముకు వచ్చిన వెంకటయ్య మండల కేంద్రంలోని చెరువు వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా శనివారం అటుగా వెళ్తున్న స్థానికులు చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు పాల్పడి చాలా రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.



వివాహిత ఆత్మహత్యాయత్నం

వేములపల్లి: సాగర్ ఎడమకాల్వలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శనివారం సాయంత్రం మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన గాదె రమ్య కుటుంబ కలహాలతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో భర్త నాగరాజుతో గొడవపడి గొట్టిపాలెం గ్రామ శివారులోని సాగర్ ఎడమకాల్వ వద్దకు చేరుకుని కాల్వలోకి దూకింది. గమనించిన స్థానికులు వెంటనే కాల్వలోకి దూకి రమ్యను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రమ్య చేతికి అయిన గాయాన్ని గుర్తించి మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం రమ్యకు కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

వలిగొండ : గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటన వలిగొండ మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములకొండకు చెందిన శాగంటి మంగమ్మ వ్యవసాయ బావి వద్ద పనిచేసుకుంటున్న క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు ఆమె దగ్గరకు వెళ్లారు. గడ్డి దొరుకుతుందా, కొంటామని వివరాలు అడుగుతున్నట్లు చేసి ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

భువనగిరి : చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన దుర్గ ప్రసాద్, షేక్ ఆరీఫ్, పల్లాపు కళ్యాణ్ గత ఫిబ్రవరి 12వ తేదీన పట్టణ శివారులో ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో హుండీ తాళం పగలగొట్టి దొంగతానికి పాల్పడ్డారు. ఆలయ ఈఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా భువనగిరి రూరల్ పోలీసులు, సీసీఎస్ సహకారంతో దొంగలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలరించిన పద్య, సాంఘిక నాటకాలు


నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మిర్యాలగూడ : పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతి కళా కేంద్రం సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు రెండోరోజు శనివారం అలరించాయి. మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్షుడు భుజంగరావు, కార్యదర్శి పులి కృష్ణమూర్తి, కోశాధికారి పుల్లభట్ల లక్ష్మీనారాయణశర్మలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనలను ప్రారంభించారు. రెండో రోజు 'మహామంత్రి తిమ్మరుసు' పద్య నాటకం, పక్కింటి మొగుడు సాంఘిక నాటకం పలువురిని ఆకట్టుకున్నాయి.

బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

సూర్యాపేట: ఎమ్మెల్సీ, ఉద్యమకారురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ మహిళా సమాజాన్ని కించపరిస్తే మహిళలు బండి సంజయ్‌ని బట్టలూడదీసి కొడతారన్నారు. మహిళలను కించ పరిచే బండి సంజయ్ నోరు ఫినాయిల్‌తో కడగాలన్నారు. మహిళలను గౌరవించలేని దౌర్భాగ్యపు అధ్యక్షుడున్న పార్టీ బీజేపీ అని విమర్శించారు. బీజేపీతో ఏదైనా తేల్చుకోవడానికి బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సూర్యాపేట క్రైం : ప్రమాదవశాత్తు సద్దుల చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర లింగయ్య (25) బ్యాండ్ వాయిద్యకారుడు పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో యర్కారం గ్రామానికి చెందిన వివాహానికి బ్యాండ్ వాయించేందుకు వచ్చారు. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న చెరువులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయాడు. సమీప జాలర్లు గుర్తించి మృతదేహాన్ని వెలికితీశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాల్వలో పడి..

కోదాడరూరల్ : కాల్వలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ వద్ద గల ఎన్ఎస్పీ కాల్వలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీనగర్ శివారులో కాల్వలో కొట్టుకవస్తున్న మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 వరకు ఉంటుందని, చామనఛాయ రంగులో ఉన్నాడని తెలిపారు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతిచెంది ఉంటాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మేళ్లచెరువు : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం మండలకేంద్రం శివారులోని చౌటపల్లి రోడ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన సీహెచ్.రమేష్ తన భార్య కుమారుడుతో కలిసి బైక్‌పై చౌటపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మేళ్లచెరువు శివారులో చౌటపల్లి వైపు నుంచి వస్తున్న టిప్పరు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రమేష్ కాలు రెండు చోట్ల విరిగినట్లు అతని భార్యకు కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ.సురేష్ తెలిపారు.

వైభవంగా శ్రీసుదర్శన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


పూజల్లో పాల్గొన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గల శ్రీపూర్ణగిరి దేవాలయం ఆవరణలో శనివారం శ్రీసుదర్శన లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంచర్ల రామకృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇంతకు ముందు ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. వీరి వెంట ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, జనగాం పాండు, నాయకులు పాల్గొన్నారు.

మండలి చైర్మన్‌కు స్వాగతం

రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బాధ్యత స్వీకరించిన తరువాత మొదటిసారిగా భువనగిరికి వచ్చిన సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. వారిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ అమరేందర్, టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు ఉన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్యబీమా

ఆత్మకూర్ (ఎస్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకంతో పేదలకు రూ.5లక్షల వరకు ఉచిత ఆరోగ్యబీమా సదుపాయం కలుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి సంధ్యాల సైదులు, గ్రామశాఖ అధ్యక్షుడు చందా కృష్ణమూర్తి, బైరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, రాచమళ్ల సంతోష్, జి.జనార్దన్, పందిరి మాధవరెడ్డి పాల్గొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): ఇంటర్ పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు పుల్లూరి సింహాద్రి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు జరుగనుండగా ప్రైవేట్ కళాశాలల యజమాన్యాలు ఫీజులు చెల్లించలేదనే సాకుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీని కారణంగా అనేక మంది విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫీజులతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలని కోరారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు.. సమగ్ర సస్యరక్షణ

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు సూచనలు




నడిగూడెం సమీపాన సాగులో ఉన్న మొక్కజొన్న పంట

నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాల్లో మూడు వేల ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట సాగు చేపట్టారు. ఈ పంటను ఆహారంగానే కాకుండా దాణా రూపంలో, పశువులకు మేత, వివిధ పరిశ్రమలలో ముడి సరుకుగా, పేలాల, తీపి కంటి, బేబీకార్న్‌గాను ఉపయోగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించి అపార నష్టం కలుగజేస్తుంది. కత్తెర పురుగు తొలిదశ నుంచే ఆశించడం వలన సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో నష్టం ఎక్కువయ్యే అవకాశం ఉంది. అవసరాన్ని బట్టి తగిన చర్యలు చేపట్టాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు చెబుతున్నారు.

పురుగు లక్షణాలు : కత్తెర పురుగు తన జీవిత చక్రాన్ని 34 నుంచి 36 రోజుల్లో పూర్తి చేసుకుంటుంది. తొలిదశ లార్వాలు లేత ఆకుపచ్చ శరీరంతో, నల్లని తల కలిగి ఉంటాయి. ఎదిగిన లార్వాలు ముదురు గోధుమ రంగులో ఉండి తలపైతెల్లని తల కిందులుగా ఉన్న ఇంగ్లీషు వై ఆకారపు గుర్తు కలిగి ఉంటుంది. ఎదిగిన లార్వాలపై నల్లని చుక్కల వరుసలుంటాయి. లార్వాతోక వైపు నల్లని 4 చుక్కలు చతురస్రాకారంలో ఉంటాయి.

సస్యరక్షణ చర్యలు : ఒక ప్రాంతంలోని మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులందరూ కలిసి సామూహిక సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం బాగుంటుంది. పంట విత్తిన వెంటనే ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు, పైరు 30 రోజుల దశ వరకు ఎకరానికి 10-15 బుట్టలు పైరుకన్నా ఒక అడుగు ఎత్తులో పెట్టాలి. పురుగు ఉనికికి, ఉధృతిని బట్టి తగిన చర్యలు చేపట్టాలి. పొలాన్ని విత్తే ముందు లోతైన దుక్కి చేయాలి. దీంతో నిద్రావస్థలో ఉన్న కత్తెర పురుగు ప్యూపాలు పక్షుల బారిన పడి లేదా ఎంట తాకి డీకి చనిపోతాయి. ఒక ఊరిలోని రైతులు మొక్కజొన్నను విడతలుగా కాకుండా వారం రోజుల వ్యవధిలో విత్తుకోవాలి. సయాంట్రనిలిప్రోల్ 19.8 శాతం మరియు థయోమిథాక్సామ్ 19.8 శాతం మందును 6 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని విత్తాలి. మొక్కజొన్నను కందిలో అంతరపంటగా 2:1 లేదా, 4:1 నిష్పత్తిలో సాగు చేయాలి. మొక్కజొన్న పంట చుట్టూ నేపియర్ పశుగ్రాసాన్ని ఆకర్షిత పంటగా వేసి, నేపియర్ గడ్డి మొక్కల మీద కత్తెర పురుగు సముదాయాలు కనిపించిన వెంటనే వేప నూనె 15000 పిపిఎం 5.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నోమోరియాలియా లేదా మెటారైజియం ఎనైసోప్లియె జీవ శిలీంద్రాలను 5 గ్రాములు లీటరు నీటికి కలిపి సాయంత్రం పూట పిచికారీ చేయాలి. 31-65 రోజులలోపు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనిటోరమ్ 0.5 మి.లీ లేదా ఇండాక్సాకార్బ్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కత్తెర పురుగు నష్టపరిచే విధానం

మొదటి దశ లార్వాలు పత్ర హరితాన్ని గీకి తినడం వలన ఆకులపై తెల్లటి పొరలు ఏర్పడతాయి. ఆకుని తొలుచుకొని తిని, తర్వాత సుడిలోకి ప్రవేశిస్తాయి. రెండు మూడు దశల్లో లార్వాలు ఆకుల సుడిలో ఉండి రంధ్రాలు చేస్తూ తింటాయి. దీని వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడతాయి. సుడిలో ఆకులను పూర్తిగా కత్తిరించి తింటాయి. ఒక్కోసారి ఆకు ఈనెలు మాత్రమే మిగులుతాయి. కంకి ఏర్పడే దశలో ఆశిస్తే కంకి పొరలను తొలుచుకుంటూ లోపలి గింజలను తింటాయి.